క్లుప్తంగా

ఇన్విజిలేటర్ సస్పెన్షన్

పరీక్షా కేంద్రంలోకి సెల్‌ఫోన్ తెచ్చుకున్నందుకు విద్యార్థి డీబార్

కడప ఎడ్యుకేషన్ : కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో పరీక్షల విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్ ప్రకాష్‌బాబును సస్పెండ్ చేసినట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. పెండ్లిమర్రి మండలం జేసీ.పల్లె హైస్కూల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రకాష్‌బాబును కడప ప్రభుత్వ బాలికల హైస్కూల్ కేంద్రంలో పరీక్షల విధులకు నియమించారు. ఈ కేంద్రంలో ఒక విద్యార్థి సెల్‌ఫోన్‌ను జేబులో ఉంచుకుని కేంద్రంలోకి వెళ్లినా.. ఆ విషయాన్ని పరిశీలించకుండా పరీక్షకు అనుమతించారు. అదే సమయంలో ఈకేంద్రానికి తనిఖీకి వచ్చిన స్క్వాడ్ బృందం విద్యార్థి జేబులో సెల్‌ఫోన్ ఉండటాన్ని గుర్తించారు. విద్యార్థిని డీబార్ చేసి.. ఆ విషయాన్ని డీఈఓ దృష్టికి తీసుకువచ్చారు. విచారణ అనంతరం విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ప్రకాష్‌బాబును సస్పెండ్ చేస్తున్నట్లు డీఈఓ తెలిపారు.

ఆర్థిక స్థోమతలేని వారికి ఉచిత న్యాయ సహాయం



జైల్ ఆవరణాన్ని పరిశీలిస్తున్న జడ్జి ఎస్.భార్గవి

జమ్మలమడుగు రూరల్ : తప్పుచేసి జైలు జీవితం గడుపుతూ ఆర్థిక స్థోమతలేని వారికి ఉచితంగా న్యాయ సహాయం అందిస్తామని జమ్మలమడుగు జూనియరు సివిల్ కోర్టు జడ్జి ఎస్.భార్గవి తెలిపారు. బుధవారం పట్టణంలోని సబ్‌జైల్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జైలు జీవితం అనుభవించిన వారు బయటకు వెళ్లిన తరువాత వారిలో మార్పు రావాలని ఆమె సూచించారు. లేనట్లయితే వారి కుటుంబాలు వీధిన పడుతాయన్నారు. అనంతరం ఖైదీలకు అందుతున్న సౌకర్యాల గురించి ఆమె ఆరా తీశారు. కార్యక్రమంలో జైల్ సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాది సుబ్బారావు పాల్గొన్నారు.

రహదారి విస్తరణలో ఎవరూ నష్టపోకూడదు

ముద్దనూరు : మండల కేంద్రంలో జాతీయరహదారి విస్తరణలో చేపడుతున్న కొలతలు సందర్భంగా గ్రామంలో ఎవరికీ నష్టవాటిల్లకూడదని, ఎవరూ నష్టపోకుండా పనులు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ ఎంపీపీ మునిరాజారెడ్డి కోరారు. బుధవారం ముద్దనూరు మండల కేంద్రంలో సుమారు రూ.7 కోట్ల వ్యయంతో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణకు సిబ్బంది కొలతలు వేస్తుండగా ఆయన వారితో మాట్లాడారు. ఎటువంటి సమస్యలు తలెత్తకుండా పనులు పూర్తిచేయాలని, విస్తరణ కోసం మార్కింగ్ సక్రమంగా చేపట్టాలని, గ్రామంలో ఎవరికీ అన్యాయం జరగకూడదని, పక్షపాతంగా అధికారులు వ్యవహరించరాదని ఆయన కోరారు.

పరామర్శ



సీకేదిన్నె పోలీసుస్టేషన్‌కు వెళ్లి పరామర్శిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కమలాపురం మండలం పాచికలపాడు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు గోవిందు విజయేంద్రారెడ్డిని సీకేదిన్నె పోలీస్‌స్టేషన్‌లో బుధవారం వైఎస్‌ఆర్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథరెడ్డి పరామర్శించారు. చింతకొమ్మదిన్నె పోలీసులు ఓ హత్యాయత్నం కేసులో విజయేంద్రారెడ్డిని అక్రమంగా చేర్చి అదుపులోకి తీసుకున్నారు. బుసిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన గజ్జల మల్లికార్జున రెడ్డి వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసుకు సంబంధించి నమోదైన క్రైం నెంబర్ 14/2024 తేదీ 29/01/2024 కేసులో గోవిందు విజయేంద్రారెడ్డి(36)ని బుధవారం అరెస్ట్ చేసి రిమాండుకు పంపినట్లు సీఐ శివశంకర్‌నాయక్ తెలిపారు.

విద్యార్థుల ప్రతిభ

పులివెందుల టౌన్ : జాతీయస్థాయిలో మ్యాథ్స్ ఒలంపియాడ్‌లో పట్టణంలోని నలంద పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని ఆ పాఠశాల కరెస్పాండెంట్ బి.సోమేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం ప్రిన్సిపాల్ వెంకటస్వామిరెడ్డి మాట్లాడుతూ మ్యాథ్స్ ఒలంపియాడ్ పరీక్షలో విద్యార్థులు పాల్గొనడంవల్ల గణితంపట్ల ఆసక్తిని పెంపొందించుకుంటారన్నారు. అనంతరం వారు ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

అన్నదానం

పులివెందుల : సమాజంలో ప్రతి ఒక్కరు ఏదో ఒక రూపంలో సేవలు అందించడం ఒక అదృష్టంగా భావించాలని దాత అన్నారెడ్డి సుధాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని అంధుల ఆశ్రమంలోనూ, పార్నపల్లె రోడ్డు సమీపాన ఉన్న లీలావతి చారిటబుల్ ట్రస్ట్ వృద్ధాశ్రమంలో అన్నారెడ్డి రాణా ప్రతాప్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి అన్నారెడ్డి వసుంధర, కుటుంబ సభ్యులు వృద్ధులకు భోజనంతోపాటు బట్టలను అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డు తహసీల్దార్ ప్రభాకరరెడ్డి, అన్నారెడ్డి వసుంధర కుటుంబ సభ్యులు, కుమార్తెలు తదితరులు పాల్గొన్నారు.

పండుగలకు పప్పన్నం లేనట్లే..



- కార్డుదారులకు అందని కందిపప్పు
- పాలకుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్న పేదలు
- ఉగాది, రంజాన్‌కు పేదలకు పప్పన్నం కరువే



సరుకుల కోసం చౌక దుకాణం వద్దకు చేరిన లబ్ధిదారులు (ఫైల్)

ఎర్రగుంట్ల : మరి కొద్ది రోజుల్లో ఉగాది, రంజాన్ పండుగలు వస్తుండటంతో ప్రతి ఒక్కరూ తమకు చక్కెరతో పాటు కందిపప్పు కావాలని అడుగుతున్నారు. నియోజకవర్గం పరిధిలో.. రేషన్ దుకాణాలు ఉన్నాయి అయితే పౌర సరఫరాల శాఖ గోడౌన్‌లకు కందిపప్పు సరఫరా లేకపోవడంతో రేషన్ డీలర్లు చేతులెత్తేశారు.

కందిపప్పు సరఫరాలో ప్రభుత్వ విఫలం

తెల్లరేషన్ కార్డుదారులకు ప్రభుత్వం అందించే కందిపప్పు కోటాలో సరఫరా నిలిపివేసింది. దీంతో తెల్ల రేషన్ లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో కందిపప్పు అందలేదు. మార్కెట్‌లో కిలో కందిపప్పు రూ.140 పలుకుతున్నా.. కార్డుదారులకు రాయితీపై కిలో రూ.67కు అందిస్తామంటూ ప్రభుత్వం ఆర్బాటంగా ప్రకటించింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి తొమ్మిది నెలలు గడిచినా రేషన్, కందిపప్పు, వంటనెనూ కార్డుదారులకు సక్రమంగా సరఫరా చేయడంలో దారుణంగా విఫలమైంది.

తలలు పట్టుకుంటున్న అధికారులు, డీలర్లు

ప్రభుత్వం ఏడు నెలల నుంచి రేషన్ దుకాణాలకు అరకొరగా కందిపప్పు సరఫరా చేస్తుండటంతో అటు అధికారులు, ఇటు డీలర్లు తలలు పట్టుకుంటున్నారు. ఉగాది, రంజాన్ పండుగలు దగ్గరకు వస్తున్న నేపథ్యంలో రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులు కంది పప్పు కోసం ఎదురుచూసినా ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ప్రభుత్వ తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కందిపప్పు ఎందుకు ఇవ్వడం లేదని కార్డుదారులు అక్కడక్కడ డీలర్లతో వాగ్వాదానికి దిగుతున్నారు. ప్రభుత్వం నుంచే సరఫరా లేదని సమాధానం చెబుతున్నారు. జగనన్న పాలనలో ప్రతి ఒక్క కార్డుదారుడికి బియ్యం చక్కెర,

నియోజకవర్గ వ్యాప్తంగా రేషన్ దుకాణాలు, కార్డులు		
మండలం	రేషన్ షాపులు	రేషన్ కార్డులు
ఎర్రగుంట్ల	37	20785
జమ్మలమడుగు	37	20879
ముద్దనూరు	30	10435
మైలవరం	31	12728
కొండాపురం	35	11885
పెద్దముడియం	25	9275

గోధుమపిండి, జొన్నలు, రాగులు, పంపిణీ చేసిన విషయం వారు గుర్తు చేసుకుంటున్నారు.

ఆకాశన్నంటిన నిత్యావసరాల ధరలు

ఉగాది, రంజాన్‌లకు ప్రతి ఒక్కరూ పిండి వంటలు చేసుకోవడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర సరుకులైన శనగ, కందిపప్పు, బెల్లం, నూనెధరలు అమాంతం పెరిగాయి. కంపెనీని బట్టి లీటర్ నూనె రూ.130 నుంచి రూ.160 వరకు విక్రయిస్తున్నారు. దీంతో ఈ ఏడాది ఉగాది, రంజాన్ పండుగులకు పిండి వంటలు చేసుకుని తినడం కష్టమేనని పేదలు అభిప్రాయపడుతున్నారు.

కందిపప్పు ఇవ్వడం లేదు



ఈనెలలో ఉగాది పండుగ ఉన్నందున ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు కందిపప్పు ఇస్తుందనుకుంటే ఇవ్వలేదు. మాలాంటి సామాన్య ప్రజలకు కిలో కందిపప్పు ఇస్తే బాగుటుంది. బయట మార్కెట్లో కిలో కందిపప్పు రూ.140 వరకు ఉంది. ఈ విషయంలో ప్రభుత్వం ఆలోచించి అందరికీ కంది పప్పు ఇవ్వాలి.

– కసిరెడ్డి సృజనదేవి, ఎంపీటీసీ, హనుమనుగుత్తి, ఎర్రగుంట్ల

పౌష్టికాహారం కూడా సక్రమంగా అందడంలేదు



అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే కందిపప్పు, బియ్యంలలో తుకాలలో తక్కువగా వస్తున్నాయి. గత ప్రభుత్వం హయాంలో డీలర్లే అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులను సరఫరా చేశారు. వారు ఇప్పుడు మేమే డీలర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి దుస్థితి వచ్చింది. ప్రభుత్వం ఇస్తున్న సరుకులు కూడా సక్రమంగా ఇవ్వలేదు. బియ్యం తుకాలలో 5 కిలోలు తక్కువగా వస్తున్నాయి. లబ్ధిదారులకు అవసరమైన పౌష్టికాహారం ప్రభుత్వం ఇస్తున్నా... డీలర్లు ఇవ్వలేదు.

–ఎస్ మంజుల, అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు, ఎర్రగుంట్ల

కందిపప్పు అలాట్‌మెంట్ కాలేదు

పంచదార, బియ్యమే ఇచ్చాం. ప్రభుత్వం కందిపప్పు అలాట్‌మెంట్ చేయడంలేదు. అందుకే కందిపప్పు ఇవ్వలేదు. కేవలం బియ్యం, చక్కెర మాత్రం కార్డుదారులకు పంపిణీ చేస్తున్నాం.

– బాబాఫక్రుద్దీన్, డీటీ సివిల్ సప్లై గొడౌన్, ఎర్రగుంట్ల

దరఖాస్తులకు ఆహ్వానం

సింహాద్రిపురం: మండలంలోని నిడివెల్ల గ్రామ సమీపంలో వద్ద ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎస్‌ఓ గురుదేవి తెలిపారు. ఈ నెల 22వ తేదీ నుంచి వచ్చేనెల 11వ తేదీ వరకు ఈ విద్యాలయాల్లో 6వ తరగతి నుంచి 12వ తరగతి ప్రవేశాలకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చునన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

వేంపల్లె : పట్టణంలోని బాషా ఆసుపత్రిలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రముఖ గుండె సంబంధిత వైద్య నిపుణులు డాక్టర్ శ్రావణ్‌కుమార్ రెడ్డి గుండె సంబంధిత వ్యాధులపై ఉచితంగా వైద్య సేవలు అందిస్తారన్నారు. ఈసీజీ, 2డీ ఏకో, సేవలు అందుబాటులో ఉన్నాయన్నారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ముద్దనూరు : బలహీన వర్గాల కులవృత్తులు, చేతివృత్తుల కుటుంబాల వారు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆదరణ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుందరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో ఆదరణ పతకంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ బీసీలకు, చేతివృత్తుల కుటుంబాల అభ్యున్నతికి ఆదరణ పథకం కింద పనిముట్లను ,పరికరాలను అందజేస్తుందని, దీనిపై సచివాలయ సిబ్బంది అవగాహన కల్పిస్తారని ఆయన తెలిపారు. సమావేశంలో మండల విస్తరణాధికారి వీరభద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వేంపల్లె ఆర్టీసీ బస్టాండును వెంటనే ప్రారంభించాలి



నూతన ఆర్టీసీ బస్టాండు వద్ద నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నేతలు

వేంపల్లె : వేంపల్లెలో ఆర్టీసీ బస్టాండును వెంటనే ప్రారంభించాలని స్థానిక కాంగ్రెస్ నేతలు బుధవారం బస్టాండు వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి మాట్లాడుతూ వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో దాదాపు 50 వేల జనాభా ఉంటుందని, చక్రాయపేట, వేముల, వీరపునాయునిపల్లె, పెండ్లిమర్రి మండలాలకు వేంపల్లె కూడలి ప్రాంతంగా ఉందన్నారు. వేంపల్లె ఆర్టీసీ బస్టాండు నిత్యం ప్రయాణీకులతో కిట కిటలాడుతుందన్నారు. గతంలో ఉన్న పాత బస్టాండును ప్రభుత్వం కూల్చివేసి దాని స్థానంలో గత ప్రభుత్వం రూ.2.30 కోట్లతో కొత్త బస్టాండును నిర్మించడం జరిగిందన్నారు. బస్టాండు నిర్మాణం పూర్తయి 5 నెలలు కావస్తున్నా ఇంతవరకు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. ప్రయాణీకులతోపాటు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, ఆర్టీసీ బస్టాండు ప్రారభించకపోవడంతో నూతనంగా నిర్మించిన బాత్రూంలను కూడా తెరవక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాబట్టి ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వేంపల్లె నూతన ఆర్టీసీ బస్టాండును ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులు కూర్చోవడానికి కూడా వీలు లేకుండా ఉందని, బస్సుల కోసం ఎండలోనే నిలబడాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కూటమి నాయకులు కొత్త భవనాలను నిర్మించలేరని కనీసం నిర్మించిన భవనాలనైనా ప్రారంభించాలన్నారు. ఈ నెలాఖరు నాటికి ఆర్టీసీ బస్టాండును ప్రారంభించకపోతే ప్రయాణికులు, ప్రజలతో కలిసి పోరాటం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రయాణీకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు వివరిస్తున్న ఏఓ నాగలక్ష్మి

పులివెందుల రూరల్ : ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించవచ్చునని మండల వ్యవసాయాధికారిణి నాగలక్ష్మి తెలిపారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్దరంగాపురం గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం సహకారంతో పులివెందుల రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై రైతు దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏఓ నాగలక్ష్మి హాజరై ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకత గురించి వివరించారు. రైతులు పురుగు మందులు లేని వ్యవసాయం చేయడం వలన పెట్టుబడి తగ్గించుకుని భూసారం కాపాడుకోవడంతోపాటు రైతుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. అనంతరం సుస్థిర వ్యవసాయ కేంద్రం ప్రతినిధులు మాట్లాడుతూ రైతు సంఘంలో అందుబాటులో ఉన్న బయో ఎరువులు, విత్తనోత్పత్తి గురించి, విత్తన రకాలు, రైతు సంఘాల ద్వారా కలిగే ప్రయోజనాలు, సేంద్రీయ ధృవీకరణ యొక్క ప్రాముఖ్యత, కిసాన్ మిత్ర అందిస్తున్న సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సుస్థిర వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం



మాట్లాడుతున్న ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి

చింతకొమ్మదిన్నె : మాదకద్రవ్యాలను పూర్తిగా నిర్మూలిద్దాం అని స్థానిక అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఫ్యాక్షన్ జోన్ ఇన్‌స్పెక్టర్ రమణారెడ్డి తెలిపారు. సమాజంలో యువత మత్తుకు అలవాటుపడి బంగారు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. చిన్నచిన్న పరిశ్రమలలో పనిచేసే కార్మికులు, కూలీలు వీటికి అలవాటు పడి కుటుంబాలు కూడా చిన్నాభిన్నం అయ్యే పరిస్థితులు దాపరిస్తున్నాయన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యే శ్రద్ధచూపాలన్నారు. సీఐ శివశంకర్ నాయక్ మాట్లాడుతూ పలువురు మత్తు పదార్థాలకు అలవాటు పడి, డబ్బుల కోసం నేరాలు, హత్యలకు సైతం పాల్పడుతున్నారన్నారు. కళాశాల సమీప ప్రాంతాలలో ఎవరైనా మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారన్న సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందిస్తే వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి ఎక్కడెక్కడ ఉందో వాటి మూలాలకు వెళ్లి చర్యలు తీసుకుంటామన్నారు. సమాజాన్ని కాపాడాల్సిన యువత ప్రాణాంతకమైన మత్తు పదార్థాలకు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎ.సుధాకరరెడ్డి, హెచ్‌ఓడీ కె.ఎస్.శశికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తీర్ణతశాతం తగ్గినా సరే.. తల తిప్పనివ్వద్దు

జమ్మలమడుగు : పది పరీక్షల్లో ఉత్తీర్ణతశాతం తగ్గిన సరే.. తల తిప్పనివ్వద్దు అని ఉన్నత విద్యాశాఖాధికారులు ఇన్విజిలేటర్‌లకు కఠిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఏడాది విద్యాసంవత్సరంలో పదవ తరగతి రాస్తున్న విద్యార్థుల సంఖ్య 27,800 మంది. అందులో బాలికలు 13,470, బాలురు 14,330 మంది ఉన్నారు. వీరందరికి 161 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో ఉత్తీర్ణత పెరుగుతున్నా ఇంటర్మీడియట్‌కు వచ్చే సరికి ఉత్తీర్ణత శాతం గణనీయంగా తగ్గిపోతుంది. మనం కఠినంగా లేకపోవడం వల్లనే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతింటుంది. ఈ ఏడాదినుంచైనా పరీక్షా కేంద్రాలలో పరీక్షలు రాసే విద్యార్థులను తల తిప్పనివ్వకుండా రాసేవిధంగా ఇన్విజిలేటర్‌లు కఠినంగా వ్యవహరించాలంటూ జిల్లా అధికారులు సూచినట్లు తెలుస్తుంది.

సబ్జెక్టులపైనే దృష్టి...

ప్రస్తుతం లాంగ్వేజీ పరీక్షలను జిల్లాలోని పరీక్షా కేంద్రాలలో ఇన్విజిలేటర్లు చూసిచూడనట్లు వ్యవహరించినా రాబోయే సబ్జెక్టులపై కఠినంగా వ్యవహరించాలంటున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఉపాధ్యాయులు చదవించటానికి తీవ్ర ప్రయత్నాలు చేసినా విద్యార్థులు మాత్రం అలసత్వం ప్రదర్శిస్తున్నారన్నారు. పదవ తగరతి ఉత్తీర్ణత సాధించిన తర్వాత ఇంటర్మీడియట్‌లో కనీసం 40 శాతం మంది కూడా ఉత్తీర్ణత శాతం లేకపోవడంతో పదవ తరగతి పరీక్షల్లో ఈ సారైన గట్టిగా పట్టుకుంటే రాబోయే విద్యార్థులు అలర్టు అవుతారనే ఉద్దేశ్యంతోనే విద్యాశాఖ ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను జారీ చేసినట్లు తెలుస్తోంది.

ఆధార్ మొబైల్ సెంటర్లను సద్వినియోగం చేసుకోండి

కమలాపురం : మండలంలోని లేటపల్లె, ఎల్లారెడ్డిపల్లె, టి.చదిపిరాళ్ల, జంభాపురం గ్రామ సచివాలయాల్లో ఈ నెల 19వ తేదీ నుంచి 4 రోజుల పాటు జరిగే ఆధార్ మొబైల్ సెంటర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే ఈనెల 25వ తేదీ నుంచి 28వ తేదీ వరకు కమలాపురం-3, కమలాపురం-4, సంబటూరు, కోగటం గ్రామ సచివాలయాల్లో మొబైల్ ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కేంద్రాలలో 0-5 సం. వారికి ఆధార్ అప్‌డేట్ చేయడంతో పాటు, చిరునామా మార్పు, ఆధార్‌కు ఫోన్ నెంబర్ లింక్, వేలి ముద్రలు అప్‌డేట్ చేస్తారని తెలిపారు.

21న కులవృత్తుల వారి సమావేశం

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఈనెల 21వ తేదీన సాయంత్రం 4 గంటలకు కుల వృత్తుల వారి సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ జ్యోతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదరణ-3 పథకం కింద చేతి వృత్తుల వారికి అవసరమైన ఆధునిక పనిముట్ల కొరకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. బీసీ కులానికి చెందిన నాయీ బ్రాహ్మణులు, రజకులు, వడ్డెర, మత్స్యకార, చేనేత, స్వర్ణకారులు, వడ్రంగి, పాల వ్యాపారులు, కల్లు గీత కార్మికులు, కుమ్మరి, మేదర, వాల్మీకి బోయ, కృష్ణ బలిజ, సగర ఉప్పర, శిల్పి, కరెంటు, ప్లంబింగ్ తదితర పనులు చేసే వారు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆమె తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా వుండాలి

ముద్దనూరు : సమాజంలో సైబర్‌నేరాలు అధికమవుతున్నాయని ప్రజలు, ఖాతాదారులు అప్రమత్తంగా వుండాలని సీఐ దస్తగిరి సూచించారు. బుధవారం సాయంత్రం స్థానిక పాతబస్టాండు ఆవరణలో సైబర్ నేరాల అవగాహనపై పోలీసు కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనకు తెలియకుండానే ఆన్‌లైన్ ద్వారా బ్యాంకులోని సొమ్మును కాజేస్తున్నారని, ఈ నేరాలపట్ల అవగాహన పెంచుకోవాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

వల్లూరు : కడప-తాడిపత్రి ప్రధాన రహదారిపై గోటూరు పెట్రోల్ బంకు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన సమాచారం మేరకు కడపకు చెందిన జావీద్ మరొక వ్యక్తితో కలిసి వల్లూరు వైపు నుండి కడప వైపుకు ప్రయాణిస్తున్న మోటారు బైక్, కమలాపురంకు చెందిన సాదక్ కడప నుండి కమలాపురం వైపుకు ప్రయాణిస్తున్న మరో మోటార్ బైక్ గోటూరు పెట్రోల్ బంకు సమీపంలో ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో సాదక్, జావీద్‌లు తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స కోసం వారిని 108 వాహనం ద్వారా కడప రిమ్స్‌కు తరలించారు.

50 శాతం రాయితీ

సింహాద్రిపురం : రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ గృహ వినియోగదారులకు విద్యుత్ అదనపు లోడు క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఇస్తుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ దినేష్‌కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక విద్యుత్ ఏఈ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఒక కిలో వాట్‌కు డెవలప్‌మెంట్ చార్జీలు గతంలో రూ.2వేలు ఉండగా 50 శాతం రాయితీతో రూ.1000 మాత్రమే చెల్లించాలన్నారు. ఈ రాయితీ పొందేందుకు ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్‌లో కానీ, విద్యుత్ ఉపకేంద్రంలో ఉన్న అధికారులను కలిసి దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదు



టి.చదిపిరాళ్లలో రోడ్లను శుభ్రం చేస్తున్న హరిత రాయబారులు, పరిశీలిస్తున్న ఎంపీడీఓ జ్యోతి

కమలాపురం : చెత్త ఎక్కడ పడితే అక్కడ వేయరాదని ఎంపీడీఓ జ్యోతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చదిపిరాళ్ల గ్రామంలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. హరిత రాయబారులతో కలసి ఆమె గ్రామంలోని పలు కాలనీల్లో రోడ్లపై ఉన్న చెత్తా చెదారాన్ని ఊడ్చివేశారు. అనంతరం ఇంటింటికి వెళ్లి చెత్త సేకరణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటిలోని చెత్తా చెదారాన్ని రోడ్లపై వేయరాదని, అలా వేస్తే రూ.200 జరిమాన విధిస్తామన్నారు. పంచాయతీ అధికారులు పంపిణీ చేసిన డస్ట్‌బిన్‌లలో తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఉంచాలన్నారు. హరిత రాయబారులు మీ ఇంటికి వచ్చి చెత్తను సేకరిస్తారని వివరించారు. అలాగే ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. తద్వారా గ్రామం పరిశుభ్రంగా ఉంచడంతో పాటు చెత్త నుంచి సంపద సృష్టించవచ్చన్నారు. తద్వారా పంచాయతీ అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం పంచాయతీలో 30 సిమెంట్ చెత్త కుండీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగరత్నమ్మ, ఈఓపీఆర్‌డీ కెజియా, పంచాయతీ సెక్రటరీ పెంచలయ్య, హరిత రాయబారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నీటి నిల్వ కుంటలు తవ్వుకోవాలి



మస్టర్ తనిఖీ చేస్తున్న డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి

కమలాపురం : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులందరూ తమ పొలంలో నీటి నిల్వ కుంటలు తవ్వుకోవాలని డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని టి.చదిపిరాళ్ల గ్రామానికి చెందిన రైతులు రవీంద్రారెడ్డి, సాయిప్రసాద్‌రావు, గోపులాపురం రైతు అరుణకుమారి పొలాల్లో తవ్వుతున్న నీటి నిల్వ కుంటలను ఆయన పరిశీలించారు. అలాగే గోపులాపురం వెళ్లే దారిలో జరుగుతున్న కాల్వ పనులను పరిశీలించారు. మస్టర్ తనిఖీ చేసి హాజరు చెక్ చేశారు. అలాగే ఉపాధి హామీ ద్వారా నాటుకున్న చీనీ చెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు ఉపాధి హామీ ద్వారా ఉచితంగా తమ పొలాల్లో ఒక వైపు నీటి నిల్వ కుంటలను తవ్వ కోవాలన్నారు. తద్వారా నీరు నిల్వ ఉంటుందని, అలాగే ఆ నీటిని భూమిలోకి పంపి రీచార్జ్ చేయవచ్చన్నారు. నీటి నిల్వ కుంటల్లో ఉన్న నీటిని అత్యవసర సమయాల్లో వాడుకోవచ్చన్నారు. ఎక్కువ మంది రైతులు తమ పొలాల్లో కుంటలు తవ్వుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ పార్థసారథి, జేఈ ఉపేంద్రారెడ్డి, టీఏలు మేరి, ఆదినారాయణ, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

ఆర్టీపీపీ కాలుష్యాన్ని నివారించాలని సీఈకి వినతి



ఆర్టీపీపీ సీఈకి వినతిపత్రం అందిస్తున్న రైతులు

ముద్దనూరు : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు నుంచి వెలుబడే బూడిద కాలుష్యాన్ని నివారించి తమ పంటలను కాపాడాలని బుధవారం కొసినేపల్లె రైతులు ఆర్టీపీపీ సీఈ గౌరీపతికి వినతిపత్రం అందించారు. మండలంలోని కొసినేపల్లె గ్రామానికి చెందిన రైతులు సీఈతో మాట్లాడుతూ తమ గ్రామంలో ప్రజలంతా వ్యవసాయం ఆధారంగా జీవనం సాగిస్తున్నారని, ఆర్టీపీపీ ప్రహరీ గోడ పక్కనే తమ పొలాలు వున్నాయని, చిమ్నీల నుంచి వెలుబడే బూడిద తమ పంటలను నాశనం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కాలుష్యం వల్ల పంటలు నాశనమవడం, దిగుబడి, నాణ్యత కోల్పోతుండటంతో ఆర్థికంగా నష్టపోతున్నామని, సత్వరమే ఈ కాలుష్యాన్ని నివారించి తమ గ్రామ రైతులకు న్యాయం చేయాలని వారు సీఈకి వినతిప్రతం అందించారు.

విత్తన గుళికలు తయారీ విధానంపై అవగాహన



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ప్రవీణ్‌కుమార్

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక ఐజీగార్డులో బుధవారం ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్‌కుమార్ ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి ప్రకృతి వ్యవసాయంలో విత్తన గుళికల తయారీ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన వర్షాదార మెట్ట భూములు ఖాళీగా ఉండటం వలన సూర్యుని నుండి నేరుగా భూమిపై కిరణాలు పడటం వలన భూమి వేడెక్కి భూమిలో సూక్ష్మ జీవులు చనిపోయి పోషకాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. 365 రోజులు పంటలతో కప్పి ఉంచాలనే పద్ధతిలో భాగంగా వర్షాకాలం రాక ముందే రైతులతో విత్తనాలు గుళికలు చేసి విత్తనాలు విత్తడం తయారీ విధానం, భీజామృతం, ఘన జీవామృతం, విత్తన శుద్ధి తదితర వాటిపై డెమో ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అడిషనల్ డీపీఎం వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ జిల్లా సిబ్బంది, శిక్షకులు, ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్ (ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణురాలు డాక్టర్ ఎస్.సౌజన్య సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సబ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.